బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 27 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4

## బీజేపీకి బిగ్ షాక్

- ఆరూరి రమేష్ రాజీనామా... బీఆర్ఎస్‌లో చేరనున్న మాజీ ఎమ్మెల్యే



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికలకు ముందే భారతీయ జనతా పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీకి రాజీనామా చేశారు. సోమవారం ఆయన తన రాజీనామా లేఖను విడుదల చేస్తూ, బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. బుధవారం తన సొంత గూటైన బీఆర్ఎస్‌లో అధికారికంగా చేరనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రాజీనామా లేఖలో, "భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్య త్వానికి రాజీనామా చేస్తున్నాను. ఇన్ని రోజులు నాకు సహకరించిన బీజేపీ పెద్దలకు, నాయకుల కు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు. భారత రాష్ట్ర సమితి అధిష్టానం ఆదేశాల మేరకు నా ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్‌లోకి త్వరలోనే పలువురు నాయకులు, నా అనుచరులు, అభిమానులతో కలిసి చేరాలని నిర్ణయించుకున్నాను" అని ఆరూరి రమేష్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ



- "విజన్ 2047 డాక్యుమెంట్" ద్వారా నిర్దేశించాం
- హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపేలా ప్రణాళికలు
- రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్
- రెండేండ్లలో 62,749 ఉద్యోగాల కల్పన
- 1.30 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం పంపిణీ
- మేడారం అభివృద్ధికి రూ.251 కోట్లు
- 77వ గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ--2047' డాక్యుమెంట్ ద్వారా రాష్ట్రానికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్?గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఐటీఐలను ఆధునిక టెక్నికల్ సెంటర్లుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 62 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. భూవివాదాల పరిష్కారానికి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, రైతులకు బోనస్?గా రూ.1,780 కోట్లు చెల్లించామని చెప్పారు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, 26 లక్షల రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు వివరించారు.

**విద్య, వైద్యానికి పెద్దపీట**

ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, 1.30 కోట్ల కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గవర్నర్ పేర్కొన్నారు. రూ.2 వేల కోట్లతో 27 ఎకరాల్లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు సమాన అవకాశాల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

మహిళలు ఇప్పటి వరకు రూ.200 కోట్ల విలువైన ఉచిత బస్సు ప్రయాణాలు చేసినట్లు తెలిపారు. మహిళలను పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నామని, బ్యాంక్ రుణాల ద్వారా రూ.40 వేల కోట్లు అందించామని వెల్లడించారు.

హ్యామ్ విధానంలో 12 వేల కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, తొలి దశలో రూ.11,399 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ అమలు చేస్తామని, చేనేత కార్మికులకు రూ.5 లక్షల బీమా పథకం అమలులో ఉందని గవర్నర్ వివరించారు.

గ్రూప్-1, 2, 3 ద్వారా రెండేండ్లలో 62,749 ఉద్యోగాలు భర్తీ చేశామని గవర్నర్ తెలిపారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిం దని చెప్పారు. ప్రయివేట్ విద్యా సంస్థలతో సమానంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నా రు. విద్యార్థుల మెస్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకుగాను 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందన్నా రు. అలాగే పోలీస్ సిబ్బంది పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభించామని గవర్నర్ తెలిపారు.





## కర్తవ్యపథ్‌లో వైభవంగా గణతంత్ర పరేడ్

- 30 శకటాలతో దేశ వైవిధ్యానికి అద్దం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత 77వ గణతంత్ర దినోత్సవ పరేడ్ సోమవారం దిల్లీలోని కర్తవ్యపథ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు ప్రదర్శించిన 30 శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పరేడ్?లో ప్రదర్శించిన శకటాల్లో నాలుగు 'వందేమాతరం' ప్రధాన ఇతివృత్తంతో రూపొందించగా, మరో ఏడు శకటాలు 'ఆత్మనిర్భర్ భారత్' థీమ్‌తో అలరించాయి. మిగిలిన శకటాలను రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ప్రతిబింబించేలా, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల విజయాలను చాటిచెప్పేలా కళాత్మకంగా రూపొందించారు. మొత్తం 30 శకటాల్లో 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవి కాగా, 13 కేంద్ర మంత్రిత్వ శాఖల శకటాలు పరేడ్?లో పాల్గొన్నాయి. ప్రతి శకటంలో ఆయా రాష్ట్రాల ప్రత్యేకతలు, అభివృద్ధి ప్రగతి, జాతీయ ఐక్యత భావన ప్రతిఫలించేలా రూపకల్పన చేయడం విశేషంగా నిలిచింది. ప్రదర్శించిన శకటాలు, వాటికి అనుసంధానమైన ఇతివృత్తాల వివరాలను ఈ కథనంలో వివరంగా పొందుపరిచారు.

దేశ 77వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని సాయుధ బలగాల శక్తి సామర్థ్యాలను, సైనిక పాటవాన్ని చాటేలా ఉత్సాహభరితమైన వాతావరణంలో, కన్నుల పండువగా పరేడ్ (కవాతు)ను నిర్వహించారు. '150సంవత్సరాల వందేమాతరం' థీమ్ ప్రధానంగా కర్తవ్య పథ్‌లో ఈ ప్రదర్శన జరిగింది. బ్రహ్మోస్, ఆకాశ్, రాకెట్ లాంచర్ సూర్యాస్త్ర, ప్రధాన యుద్ధ ట్యాంక్ అర్జున్ సహా ప్రధాన ఆయుధ వ్యవస్థలను, క్షిపణులు, యుద్ధ విమానాలు, కొత్తగా ప్రారంభించిన యూనిట్లు అన్నింటినీ ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. ప్రధానంగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలన్నీ ఈ పరేడ్‌లో కొలువుతీరాయి. 'ఆపరేషన్ సిందూర్'లో ఉపయోగించిన పలు దేశీయ ఆయుధ వ్యవస్థలతో వచ్చిన భారత సైనిక శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్‌కు వాడిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ అందరినీ ఆకట్టుకుంది. 'వివిధత్వంలో ఏకత్వం' అన్న ఇతివృత్తాన్ని ప్రదర్శించేలా సాగిన ఈ పరేడ్‌కు అగ్ర భాగాన దాదాపు వంద మంది కళాకారులు నాయకత్వం వహించారు. బ్రహ్మాండంగా సంగీత వాయిద్యాల ప్రదర్శనతో దేశ ఐక్యత, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యతలను ప్రదర్శిస్తూ కవాతు సాగింది. పరేడ్‌కు ప్రారంభ సూచకంగా భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు ప్రేక్షకులపై పూల జల్లులు కురిపించాయి. మరోవైపు గగనతలంలో యుద్ధ విమానాలు పలు ఆకృతులతో చేసిన విన్యాసాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భారత వైమానిక దళానికి చెందిన నాలుగు హెలికాప్టర్లు కర్తవ్యపథ్‌పై ఎగురుతూ జాతీయ పతాకంతో పాటూ త్రివిధ దళాల పతాకాలను ప్రదర్శించాయి. ఐఏఎఫ్ కు చెందిన రాఫెల్ జెట్‌లు వజ్రాంగ్ ఫార్మేషన్‌లో విన్యాసాలు నిర్వహించాయి. భారత స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల చిత్రపటాలతో స్కూలు పిల్లలు పరేడ్‌లో పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటానియో కోస్టా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లు సాంప్రదాయ బగ్గీలో కర్తవ్య పథ్‌కు చేరుకున్న వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైనిక వందనాన్ని స్వీకరించారు. దాంతో పరేడ్ ప్రారంభమైంది. ప్రధాని మన్మోహన్ సింగ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, దేశ త్రివిధ దళాధిపతులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌ను నిర్మించాలనే మన ఉమ్మడి కర్తవ్యంలో ఈ రోజు నూతన ఉత్సాహాన్ని, సంకల్పాన్ని నింపాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపిచ్చారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను తెలియచేశారు. వికసిత్ భారత్‌లో మహిళల పాత్ర శ్లాఘనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా కొనియాడారు. దేశ ప్రజలకు శుభాకాంక్షలు అందచేశారు.

విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరంగా, సంపద్వంతంగా, భద్రంగా తయారుచేస్తుందని యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్నారు. దాన్నుండి మనందరం ప్రయోజనాలు పొందుతామన్నారు. భారత గణతంత్ర ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఉత్సవాల అనంతరం సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు.

## అర్ధరాత్రి ఆదుకున్న హైడ్రా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అర్ధరాత్రి హైడ్రా ఆపదమిత్ర పాత్ర పోషించింది. హైదరాబాద్ పాతబస్తీ జూపార్కు దగ్గరలోని మిరాలం చెరువులో చిక్కుకున్న 9 మందిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందం ఆదివారం అర్ధరాత్రి కాపాడింది. వివరాల్లోకెళ్తే.. మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో భాగంగా ట్యాంక్ మీదుగా నిర్మించనున్న వంతెన కోసం సాయిల్ టెస్ట్‌కు కార్మికులు, ఇంజినీర్లు ఆదివారం ఉదయం బోటు సాయంతో వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం చీకటి పడ్డాక తిరిగి రావాల్సి ఉండగా బోటు ఇంజిన్ ఫెయిల్ అయింది. అప్పటికే చీకటి పడటంతో ఆందోళనకు గురయ్యారు. మెకానిక్ బృందానికి ఫోన్ చేయగా బోటు ఒడ్డుకు వస్తేనే ఇంజిన్ మరమ్మతు చేయగలమని చెప్పారు. బోటును మెల్లగా నెట్టుకొద్దామని ప్రయత్నిస్తే చెరువులో దట్టంగా వున్న గుర్రపు డెక్క ముందుకు కదలనీయలేదు. ఒకపక్క చెరువులో ఉన్న మొసళ్ల భయం, మరోపక్క ఒడ్డుకు చేరే అవకాశం లేక ప్రాణం అరచేతిలో పెట్టుకొని భయాందోళనకు గురయ్యారు. ఈ తరుణంలో డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే హైడ్రా డీఆర్ఎఫ్ కంట్రోల్ రూంకి ఫోన్ వచ్చింది. మిరాలం చెరువు మధ్యలో చిక్కుకున్న వారితో హైడ్రా డీఆర్ఎఫ్ బృంద సభ్యులు మాట్లాడారు. హైడ్రా ఎస్ఎఫ్ఓ జమీల్, హైడ్రా రెస్క్యూ టీమ్ ఇన్‌చార్జి స్వామి నేరుగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తాము బోటుతో వస్తాం.. రాత్రి ఎంత సమయం అయినా సురక్షితంగా బయటకు తీసుకొస్తామని చెబుతూ.. నిరంతరం వాళ్లతో మాట్లాడారు. చీకటిగా ఉండటం.. గుర్రపు డెక్క ఎక్కువగా ఉండటంతో చెరువులో చిక్కుకున్న వారిని ఒడ్డుకు చేర్చడం కష్టమైంది. సెల్‌ఫోన్ లైట్లతో చెరువులో చిక్కుకున్నవాళ్లు ఆచూకీ చెప్పగా, టార్చ్ లైట్లతో డీఆర్ఎఫ్ బృందాలు అతి కష్టమ్మీద అక్కడకు చేరుకున్నాయి. ముందుగా నలుగురిని డీఆర్ఎఫ్ బోటులో ఒడ్డుకు చేర్చారు. రెండోసారి వెళ్లి మిగిలిన ఐదుగురుని తీసుకొచ్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తమను కాపాడిన హైడ్రా బృందాలకు ధన్యవాదాలు తెలిపారు. చాలా ఆందోళనకు గురయ్యాయమని, నిరంతరం తమతో ఫోన్లో మాట్లాడుతూ ధైర్యం చెప్పడమే కాకుండా అర్ధరాత్రి వేళ తమని కాపాడారని చెప్పారు.

## మాంజా తాకి బాలిక మృతి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నిషేధిత మాంజ కారణంగా ఓ పసి ప్రాణం గాల్లో కలిసిపోయిన హృదయవిదారక ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంపై తల్లిదండ్రులతో ప్రయాణిస్తున్న ఐదేండ్ల చిన్నారి మెడకు మాంజ తగలడంతో అక్కడికక్కడే మతి చెందింది. కూకట్‌పల్లి ఎస్‌హెచ్ఓ కేవీ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ గోకుల్ ఫ్లాట్స్‌లో నివసించే రామ్‌సాగర్ దంపతులు సోమవారం తమ కుమార్తె నిష్విక దరియా (5)తో కలిసి బైక్‌పై వెళ్లి పటాన్ చెరు సమీపంలోని ఖాజీపల్లి గ్రామంలో ఇటీవల వారు కొనుగోలు చేసిన ఇంట్లో జరుగుతున్న ఇంటీరియర్ పనులను పరిశీలించారు. తిరిగి వస్తూ కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ నగల దుకాణానికి వెళ్దామని అనుకొని వివేకానంద నగర్ జాతీయ రహదారిపై ప్రయా ణించారు. అయితే వారు అది దాటి ముందుకు రావడంతో యూటర్న్ తీసుకొని వెళ్దాం అనుకొని వస్తుండగా పాప గొంతుకు నిషేధిత మాంజా చుట్టుకుని తీవ్రంగా కోసుకుపోయింది.. దాంతో ఆమె ఒక్కసారిగా బిగ్గరగా అరవడంతో తండ్రి గమనించి చూసేసరికి తీవ్ర రక్తస్రావం అయ్యింది. అప్రమత్తమైన తండ్రి చిన్నారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు.

## రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న బీజేపీ--కాంగ్రెస్



- తెలంగాణ భవన్‌లో హెచ్‌సీయూ విద్యార్థుల ప్రత్యేక నాటిక...
- కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పోటీ పడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ప్రత్యేక నాటిక ప్రదర్శన జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. నాటిక అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రాహుల్ గాంధీ ప్రతిసారీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు.

'బోధించు--సంఘటించు--పోరాడు' అనే అంబేద్కర్ సిద్ధాంతాన్ని కేసీఆర్ సమర్థంగా ఆకళింపు చేసుకొని తెలంగాణను సాధించారని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఇచ్చిన ఆర్టికల్ 3 కారణంగానే ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు సాధ్యమైందని, అల్పసంఖ్యాక వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పోటీ పడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో 'అనుముల రాజ్యాంగం' నడుస్తోందని వ్యాఖ్యానించారు. తుక్కుగూడలో రాహుల్ గాంధీ ఇచ్చిన న్యాయ పత్రం అన్యాయ పత్రంగా మారిందని విమర్శించారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా చట్టం చేస్తామన్న రాహుల్ గాంధీ వెనకే ఫిరాయింపుదారులు ఉన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో జర్నలిస్టులను ఉగ్రవాదుల్లా అరెస్టు చేస్తున్నారని, కోదాడలో కర్ర రాజేష్ లాకప్ డెత్‌కు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. దళితుడు కావడమే కాంగ్రెస్ పాలనలో రాజేష్ చేసిన తప్పుగా మారిందని విమర్శించారు. దళితుడు అధ్యక్షుడిగా ఉన్నాడని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ పాలనలో, దళితుడి లాకప్ డెత్?పై ముఖ్యమంత్రి గానీ, స్థానిక మంత్రి గానీ స్పందించలేదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'జెండా గద్దెలు కూల్చండి' అంటూ ప్రజలను రెచ్చగొడుతున్నారని, శాంతిభద్రతలను, రాజ్యాంగ విలువలను పాతిపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాజ్యాంగాన్ని పాతర వేస్తున్న రేవంత్ రెడ్డి పాలన ప్రజాపాలన కాదని, రాజ్యాంగాన్ని పరిహసించే రాక్షస పాలనగా అభివర్ణించారు. రాజ్యాంగాన్ని బందీ పెట్టే విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసే వ్యక్తి సరైనవాడు కాకపోతే ప్రయోజనం ఉండదని అంబేద్కర్ అన్న మాటలు నేడు కేంద్రం, రాష్ట్రాల్లో నిజమవుతున్నాయని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి లాక్కోనే ప్రయత్నం చేయగా, విద్యార్థులు చేసిన పోరాటంతో దేశం కదిలిందన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు కూడా స్పందించి ఎంపవర్డ్ కమిటీ ఏర్పాటు చేసిందని, రూ.10 వేల కోట్ల భూకుంభకోణం జరిగిందని కమిటీ తేల్చినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్--బీజేపీ పార్టీలు కలిసి భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నాయని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

## 26 వేలకే కారు అంటూ మోసం

- నిర్వాహకులు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్:**

'రూ.26 వేలకే కారు' అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసి అమాయకులను మోసం చేసిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనతో ఆగ్రహించిన కొనుగోలుదారులు రాళ్లతో దాడి చేసే వరకు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకెళ్తే.. మల్లాపూర్‌లో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా '26 వేలకే కారు' అంటూ ట్రస్ట్ కార్స్ నిర్వాహకులు మోహ్ద రోషాన్ గత కొద్ది రోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారం చేయడంతో కొనుగోలుదారులు సోమవారం భారీ సంఖ్యలో అతని షాపు వద్దకు చేరుకున్నారు. దాంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే అక్కడికి వచ్చిన తర్వాత కార్లు లేవని నిర్వాహకులు చెప్పడంతో కొనుగోలుదారులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కార్లపై రాళ్లతో దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. కొనుగోలుదారులను అక్కడి నుంచి పంపించి ట్రస్ట్ కార్స్ నిర్వాహకులను అరెస్టు చేసి నాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తప్పుదారి పట్టించే సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దని పోలీసులు సూచించారు.

## హార్వర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి లీడర్‌షిప్ కోర్సు

- విద్యార్థిగా తరగతులకు హాజరైన ముఖ్యమంత్రి

**బలగం టీవీ, హైదరాబాద్**



అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లీడర్‌షిప్ సర్టిఫికెట్ కోర్సు తరగతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. 21వ శతాబ్దంలో నాయకత్వం అంశంపై నిర్వహిస్తున్న ఈ కోర్సులో భాగంగా తొలి రోజు 'అధికారిక విశ్లేషణ -- నాయకత్వం' అంశంపై మొదటి సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా మారి తరగతులను ఆసక్తిగా విన్నారు. కోర్సులో భాగంగా కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్?లో సోమవారం (జనవరి 26) ఉదయం 7 గంటలకు తరగతులు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. దావోస్‌లో మూడు రోజుల పర్యటన పూర్తి చేసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్‌షిప్ కోర్సు కోసం అమెరికాకు వెళ్లారు. ఆయన అమెరికా పర్యటన జనవరి 30 వరకు కొనసాగనుంది. హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్‌షిప్‌పై సర్టిఫికెట్ కోర్సును అభ్యసిస్తున్న తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అరుదైన ఘనత సాధించనున్నారని అధికారులు తెలిపారు.

## గవర్నర్‌ను కలవనున్న బీఆర్ఎస్ బృందం

- సింగరేణి కుంభకోణంపై వివరాలు అందజేయనున్న పార్టీ నేతలు
- సింగరేణి కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్ర మార్క, ఇతర మంత్రుల పాత్రపై ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్:**

సింగరేణి కుంభకోణం అంశంపై మంగళవారం రోజున భారత రాష్ట్ర సమితి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలవనున్నది. తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ముఖ్యంగా సింగరేణి సంస్థలో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని యథేచ్ఛగా లూటీ చేస్తోందని, ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రేపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి నాయకత్వంలో పార్టీ ప్రతినిధి బృందం గౌరవ గవర్నర్?ను కలవాలని నిర్ణయించుకుంది. ఈ సందర్భంగా, సింగరేణిలో జరిగిన అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలు, లోతైన వివరాలతో కూడిన సమగ్ర నివేదికను బీఆర్ఎస్ నేతలు గవర్నర్?కు సమర్పించనున్నారు. సింగరేణి వంటి ప్రతిష్టాత్మక సంస్థలో జరిగిన ఈ భారీ కుంభకోణంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, వారి కుటుంబ సభ్యులు, ఉప ముఖ్యమంత్రి మరియు పలువురు మంత్రులు నేరుగా భాగస్వాములయ్యారని బీఆర్?ఎస్? పార్టీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్ర సంపదను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, ఇంతటి భారీ స్కామ్?లో భాగస్వాములైన ముఖ్యమంత్రికి మరియు ఇతర మంత్రులకు పదవిలో కొనసాగేందుకు నైతిక, రాజ్యాంగ పరమైన హక్కు లేదని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. ఇదే అంశాన్ని గవర్నర్?కు తెలియజేయనున్నది. మంగళవారం రోజున జరగబోయే ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ముఖ్య ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని గవర్నర్?కు తమ నిరసనను తెలియజేయనున్నారు.

## జోగినపల్లి సంతోష్‌కు సిట్ నోటీసులు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల విచారణ అనంతరం మాజీ బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. సోమవారం మధ్యాహ్నం సంతోష్‌కు నోటీసులు అందజేసిన సిట్, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హాజరై విచారణకు సహకరించాలని సూచించింది. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారి పి. వెంకటగిరి నోటీసులో పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు సన్నిహితుడిగా పేరొందిన జోగినపల్లి సంతోష్‌ను విచారణకు పిలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇప్పటి వరకు ఈ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఎలాంటి రాజకీయ నాయకుడిని నిందితుడిగా పోలీసులు పేర్కొనలేదు. గత పది రోజులుగా సిట్ దర్యాప్తును ముమ్మరం చేస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తదితర సీనియర్ నేతలను విచారించింది. ఫోన్ ట్యాపింగ్, అక్రమ నిఘా, లక్ష్యంగా నగదు స్వాధీనం, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన అక్రమాలు, వసూళ్ల వంటి అంశాలపై వారి నుంచి వివరాలు సేకరించింది. విచారణ అనంతరం వారిని సాక్షులుగా పరిగణించి విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు తదితరుల ఫోన్లను స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూ ఇప్పటి వరకు ఈ కేసులో ఆరుగురిని నిందితులుగా గుర్తించగా, అందులో ముగ్గురు పోలీసులు, ఇద్దరు రిటైర్డ్ పోలీసులు ఉన్నారు. రాజకీయ నేతల పాత్రపై సిట్ ఇంకా విచారణ కొనసాగిస్తోంది.

## గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు రూ.50 కోట్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, హైదరాబాద్**

హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణకు రూ.50 కోట్లు కేటాయించామని, రైతులు సహకరిస్తే పనులు పూర్తిచేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి అవకాశాలకు నియోజకవర్గంలో ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రంగాయపల్లి గ్రామ పంచాయతీకి బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం రూ.40లక్షల విలువైన 33గుంటల భూమిని విరాళంగా ఇచ్చిన తిరుపతి రెడ్డిని సోమవారం సత్కరించారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

- రాజన్న సిరిసిల్ల జిల్లా లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
- శకటాలు, స్టాళ్లు, విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో, అనంతరం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్?లో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోలీస్, అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య, చేనేత ఉ జౌళి, గ్రామీణ అభివృద్ధి, ఆర్ అండ్ బీ, రోడ్డు రవాణా శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి శాఖల స్టాళ్లను పరిశీలించి అమలవుతున్న పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ స్కూటీలు, విద్యార్థులకు ల్యాప్?టాప్?లు, 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ శకటాలు ప్రదర్శించిన శాఖలకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వివిధ శాఖలకు చెందిన 273 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు అందరి సహకారంతో సజావుగా నిర్వహించుకున్నామని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతు భరోసా పథకం కింద రూ.149.27 కోట్లను లక్షకు పైగా రైతులకు అందించామని, రైతు రుణ మాఫీ పథకం ద్వారా వేలాది రైతులకు రూ.370 కోట్లకు పైగా లాభం చేకూరిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా జరుగుతోందన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంక్ లింకేజీ రుణాలు అందించి మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

గృహ జ్యోతి పథకం ద్వారా కోట్ల రూపాయల విలువైన జీరో విద్యుత్ బిల్లులు జారీ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదల స్వంతింటి కలను నిజం చేస్తున్నామని తెలిపారు. రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి వందల కోట్ల రూపాయలతో పలు పనులు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు, ఉచిత రక్త పరీక్షలు, అత్యవసర వైద్య వాహనాలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

నేతన్నలకు భరోసా పథకాలు, నూలు బ్యాంక్ ఏర్పాటు, ఇందిరమ్మ చీరల ఆర్డర్లతో సిరిసిల్ల నేత పరిశ్రమకు ఊతమిచ్చామని చెప్పారు. పారిశ్రామిక రంగంలో అపెరల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్?లతో ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. విద్యారంగంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, ఐసీటీ ల్యాబ్స్, పోటీ పరీక్షల శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, డీఎస్పీ నాగేంద్రచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వేములవాడ రాజన్న ఆలయ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం..

- 47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు ఇప్పటికే పూర్తైన సైడ్ డ్రైనేజీ నిర్మాణం
- 10 కోట్లతో మూలవాగులో,గుడి చెరువులో మురికి నీరు నిల్వ ఉండకుండా పైప్ లైన్ తో పత్యేక చర్యలు
- పనులను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎన్నో దశాబ్దాలుగా ఉన్న ప్రధాన సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. గత 50 ఏళ్లుగా భక్తులు ఎదురుచూస్తున్న ఆలయ రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.47 కోట్ల నిధులు కేటాయించగా, పనులు వేగంగా పూర్తి దిశగా సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా ఆలయానికి వెళ్లే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైనేజీ నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తయింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తికావడంతో వర్షాకాలంలో నీటి నిల్వలు, మురికి సమస్యలు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు.ఈ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గుడి చెరువులోని మూలవాగులో మురికి నీరు కలవకుండా ఉండేందుకు రూ.10 కోట్లతో పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పైపు లైన్ పూర్తయితే ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు చెరువు పవిత్రత కూడా కాపాడబడనుంది.

# ఎమ్మెల్యే హరీష్ రావుకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన చిలుముల జయవర్ధన్.

**బలగం టీవీ, సిద్దిపేట:**



గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు చిలుముల జయవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావు కి జయవర్ధన్ పూలమొక్కను అందజేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫేక్ 'ఒపీనియన్ పోల్స్ నమ్మకండి:

## సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. కృష్ణ



**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. కృష్ణ సూచించారు. ఎటువంటి శాస్త్రీయ సర్వేలు నిర్వహించకుండానే, కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను 'ఒపీనియన్ పోల్స్' పేరుతో ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వేదికలపై పోస్ట్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల పేర్లను ప్రస్తావిస్తూ, వారు గెలుస్తారని లేదా ఓడుతారని అంచనా వేస్తూ పెడుతున్న పోస్ట్?లకు ఎటువంటి అధికారిక ప్రాధాన్యత లేదు. ఇటువంటి పోస్ట్?ల వల్ల రాజకీయ పార్టీల మధ్య లేదా వ్యక్తుల మధ్య అనవసరమైన గొడవలు తలెత్తి, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాలో వచ్చే ఇటువంటి పోస్ట్?లను ఎవరూ షేర్ చేయవద్దని, ఫార్వార్డ్ చేయవద్దని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తమ సొంత ఇష్టాయిష్టాలనే సర్వేలుగా చిత్రీకరిస్తూ కొందరు గందరగోళం సృష్టిస్తున్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా పోలీసులకు సహకరించాలని సిరిసిల్ల టౌన్ ఇన్?స్పెక్టర్ కె. కృష్ణ తెలియజేశారు.



# సొంత ఖర్చులతో నూతన బోరు ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్.

- వేసవి నీటి కష్టాలకు తక్షణ పరిష్కారం... ప్రజల సేవలో ముందున్న మాజీ కౌన్సిలర్ దార లావణ్య--అశోక్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని 33వ వార్డు బివై నగర్ గల్లీల్లో తీవ్ర నీటి సమస్య ఉందని తెలుసుకుని, నీటి సమస్యను పరిష్కరించేందుకు మాజీ కౌన్సిలర్ దార లావణ్య--అశోక్ తమ సొంత ఖర్చులతో నూతన బోరును ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజల సమస్యను తెలుసుకున్న వెంటనే వారు స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజల కష్టాలను గమనించిన మాజీ కౌన్సిలర్ దంపతులు అధికారుల కోసం వేచి చూడకుండా స్వయంగా ముందుకు వచ్చి బోరు వేయించారు. సోమవారం నాడు నూతన మోటార్?ను అమర్చడంతో బీవై నగర్ గల్లీల్లో నీటి సరఫరా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దార లావణ్య--అశోక్ మాట్లాడుతూ.. ప్రజల సేవే మా పరమార్థం, భవిష్యత్తులో కూడా వార్డు ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందించి అండగా నిలుస్తాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు పెద్దలు, స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో తమకు అండగా నిలిచిన మాజీ కౌన్సిలర్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించినందుకు

# గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం పుస్తకాల పంపిణీ

## భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి.. -- జింక శ్రీధర్




**బలగం టీవీ, వేములవాడ:**

బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లి మరియు ఆరేపల్లి గ్రామ నూతన పాలకవర్గ సభ్యులకు, సంకెపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మరియు గ్రామలలోని యువజన నాయకులకు భారత రాజ్యాంగం ముఖ్య అంశాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జింక శ్రీధర్ మాట్లాడుతూ.. భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు తప్పనిసరిగా చదవాలని అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చిన హక్కులు, విధులు, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి అంశాలు తెలుసుకోవడం ఎంతో అవసరమని. ముఖ్యంగా యువత రాజ్యాంగ విలువలను అవగాహన చేసుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, దేశ ప్రజల హక్కులను రక్షించే మహత్తర గ్రంథమని తెలిపారు. గణతంత్ర దినోత్సవం వంటి ముఖ్యమైన రోజున రాజ్యాంగాన్ని ప్రజల దగ్గరికి తీసుకెళ్లడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన నాయకులు, జింక శ్రీకాంత్, జింక శ్రీను, ఉల్లెందుల శ్రీను, గ్రామ పెద్దలు, యువజనులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఓటర్ల నమోదు, ఓటరు అవగాహన కార్యక్రమాలు, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందజేశారు.

గరిమ అగ్రవాల్ గతంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక శాసనసభ నియోజకవర్గానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) గా పనిచేసిన సమయంలో, ఓటర్ల నమోదు, ఓటరు అవగాహన కార్యక్రమాలు, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా లిమై ఇండియా.. మై ఓట్ అనే థీమ్ తో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఆదివారం వేడుకలు నిర్వహించి, ఉత్తమ సేవలు అందించిన జిల్లా కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ)లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఈఓ సుదర్శన్ రెడ్డి నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు.

ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జిల్లా అధికారులు, యంత్రాంగం శుభాకాంక్షలు తెలియజేశారు.

## సిరిసిల్ల ఆర్డీఓకు అవార్డు.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) గా సేవలు అందించిన ఆర్డీఓ సీహెచ్ వెంకటేశ్వర్లు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఆదివారం సీఈఓ సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నుంచి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు.




# సిరిసిల్లలో ఘనంగా 'సాహితీ సంక్రాంతి' కవి సమ్మేళనం...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని బుధవారం గాంధీనగర్?లోని హనుమాన్ మందిరంలో కవి సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. సమితి అధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమం సాహితీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.

కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ.. "ఓల్డ్ ఈజ్ గోల్డ్" అనే సామెతను గుర్తు చేస్తూ మన పూర్వీకుల ఆచారాల వెనుక ఉన్న శాస్త్రీయతను వివరించారు. పెండతో కల్లాపి చల్లడం, పసుపుతో గడపలను పూజించడం కేవలం సంప్రదాయం మాత్రమే కాదని, అవి రోగనిరోధక శక్తిని పెంచే ఆరోగ్య సూత్రాలని పేర్కొన్నారు. నేడు కనుమరుగవుతున్న హరిదాసులు, గంగిరెద్దుల సంస్కృతిని కవులు తమ కవిత్వం ద్వారా పునరుజ్జీవింపజేయాలని పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకునూరి శంకరయ్య మాట్లాడుతూ.. సమాజ హితాన్ని కోరేదే నిజమైన కవిత్వమని అన్నారు. మన ప్రాంతపు గర్వకారణం, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా. సి.నారాయణ రెడ్డి (సినారే) తరహాలో శక్తివంతమైన పదజాలాన్ని వాడుతూ మన ప్రాంత ప్రతిభను చాటాలని కవులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వాసర వేణి పరశురాములు తన కవితా గానంతో అలరించారు. ఇటీవల ఆయన 'వివేకానంద స్ఫూర్తి అవార్డు' అందుకున్న సందర్భంగా సమితి సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పల్లెటూరి అమ్మాయి గొప్పతనంపై పాడిన పాట అందరినీ ఆలోచింపజేసింది.సహాధ్యక్షులు కోడం నారాయణ పండుగ విశేషాలను, నాటి మధుర స్మృతులను గుర్తు చేస్తూనే, నేటి సమాజంలో కనిపిస్తున్న అజాగ్రత్తలను ఎండగట్టారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న ఏనుగుల ఎల్లయ్య, గడ్డం పరశురామ శాస్త్రి, వంశీకృష్ణ తమ తమ విలక్షణమైన శైలిలో కవితలను ఆలాపించి సభికులను ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కవులు, సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఘనంగా గణతంత్ర వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సోమవారం రోజున 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వేడుకలు మిన్నంటాయి. జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, నూతనంగా నిర్మిస్తున్న జిల్లా రెడ్డి సంఘ భవన ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతలతో సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే రెడ్డి సంఘ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ



సంఘం ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, కోశాధికారి ఎడ్మల హనుమంత రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ – కంకణాల శ్రీనివాస్ రెడ్డి, మడుపు ప్రేమ్ సాగర్ రెడ్డి, కంది భాస్కర్ రెడ్డి, రెడ్డి సంఘం సీనియర్ నాయకులు ఉప్పల లక్ష్మారెడ్డి, మడుపు వెంకటరమణారెడ్డి, చిలువేరి సంతోష్ రెడ్డి, దుంద్రా ఆదిరెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీర్నపల్లిలో ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని మెయిన్ చౌరస్తాలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సంఘం మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల మూడు రంగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమాల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ.. దేశభక్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీసీల ఐక్యత మరియు హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో




ఉపాధ్యక్షులు శీర్ల శ్రీనివాస్, సలహాదారుడు దేశరాజ్ సత్తయ్య, కోశాధికారి దేశరాజ్ తిరుపతి, కార్యదర్శి ఆకుల మహేందర్, యూత్ అధ్యక్షులు దయ్యాల అంజి, ప్రచార కార్యదర్శి దేశరాజ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు గొడుగు సంజీవ్?, సీనియర్ నాయకులు దేశరాజ్ నారాయణ, మాజీ సర్పంచ్ దినాకర్, సంఘం సభ్యులు మరియు ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.



# శరవేగంగా వేములవాడ తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి పనులు..

### పనులను స్వయంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణ అభివృద్ధిలో కీలకమైన తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా రాజన్న భక్తులు, వేములవాడ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న ఈ బ్రిడ్జి నిర్మాణం ఇప్పుడు సాకారం అవుతుండటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బ్రిడ్జి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఆదివారం రోజున స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులతో కలిసి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ బ్రిడ్జి పూర్తయితే వేములవాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు రాకపోకలు మరింత సులభంగా మారనున్నాయి. అలాగే తిప్పాపూర్, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. వేములవాడ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

# పద్మ పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపిన కేటీఆర్.



**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన పద్మ పురస్కారాలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు దక్కడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించగా, అందులో తెలంగాణ నుంచి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మేధావులకు సముచిత స్థానం లభించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా సైన్స్, వైద్యం, కళలు మరియు పశుసంవర్ధక వంటి విభిన్న రంగాల్లో తెలంగాణ ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో విశేష పరిశోధనలు చేసిన చంద్రమౌళి గడ్డమానుగు, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్ మరియు కుమారస్వామి తంగరాజ్?లకు పద్మశ్రీ పురస్కారాలు లభించడం వారి మేధస్సుకు దక్కిన గౌరవమని కేటీఆర్ ప్రశంసించారు.

వీరితో పాటు వైద్య రంగంలో సామాన్యులకు అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ సర్జన్ గూడూరు వెంకట్ రావు మరియు ప్రముఖ క్యాన్సర్ నిపుణులు పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డిలకు ఈ అత్యున్నత గౌరవం దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డికి నృత్య రంగంలో ఆమె చేసిన అద్భుత ప్రదర్శనలకు గానూ ఈ పురస్కారం లభించిందని గుర్తుచేశారు. పశుసంవర్ధక రంగంలో నిస్వార్థ సేవలు అందించిన రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ ప్రకటించడం ఆయన చేసిన సేవలకు దక్కిన నిజమైన గుర్తింపు అని కేటీఆర్ అభివర్ణించారు.క్షేత్రస్థాయిలో నిశ్శబ్దంగా సమాజం కోసం పనిచేసే వారిని గుర్తించడం ముదావహమని, ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆయన ఆకాంక్షించారు. పురస్కార గ్రహీతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతిభ దేశ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని కేటీఆర్? కోరారు.



# బీసీ భవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు..

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం (బీసీ భవన్)లో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పతాక ఆవిష్కరణ అనంతరం పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ, జిల్లా ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగ ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు, వెనుకబడిన తరగతులకు పూర్తిస్థాయిలో అందాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.